క్లుప్తంగా

ఆగమోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



ప్రత్యేక అలంకారంలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

సీఆర్వో కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఈవో, చైర్మన్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం నాలుగవ గేటు వద్ద ఏర్పాటుచేసిన సీఆర్వో కార్యాలయాన్ని శనివారం పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో ఎస్వీ నాగేశ్వరరావు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ భక్తులకు వసతి గదులు కేటాయించేందుకు ఈ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు మల్లికార్జునప్రసాద్, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ కోర్సులకు అడ్మిషన్లు

రేణిగుంట: రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాలను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసి ఇంటర్ కోర్సులు నిర్వహించేందుకు అనుమతి ఇచ్చిందని హెచ్ఎం ప్రసాద్ తెలిపారు. ఈ క్రమంలో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులను ప్రారంభిస్తున్నట్లు వివరించారు. మండలంలోని 10వ తగరతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇక్కడ అడ్మిషన్లు పొందవచ్చన్నారు. వివరాలకు 944153612, 8008163116లో సంప్రదించాలన్నారు.

చిన్నారులకు చదరంగంపై శిక్షణ



చదరంగం ఆడుతున్న చిన్నారులు

శ్రీకాళహస్తి: చిన్నారుల మేధస్సు పెంపొందించేందుకు చదరంగం క్రీడ ఎంతో ఉపయోగపడుతుందని ద చిల్డ్రన్ అసోసియేషన్ సభ్యుడు సురేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం 5 నుంచి 15 ఏళ్లలోపు చిన్నారులకు చదరంగంలో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చదరంగం మన దేశంలోనే పుట్టిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ చదరంగం శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలసుబ్రమణ్యం, శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

వాహన బేరర్లకు దుస్తులు పంపిణీ



నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ఉత్సవర్ల వాహనాలను మోసే 56 మంది బేరర్లకు వేద పారాయణదారు రాఘవన్ దుస్తులను వితరణగా అందజేశారు. మండలంలోని సముదాయానికి చెందిన సుమారు 60 కుటుంబాలు తర తరాలుగా వాహనాలను మోస్తూ సేవలు చేస్తున్నారు. వెంకన్న ఆలయంలో ఇదివరకు పనిచేసిన వేదపండితులు రాఘవన్ ఏటా బ్రహ్మోత్సవాలలో వాహన బేరర్లకు దుస్తులను అందజేస్తారు. శనివారం వాహనం బేరర్లకు పంచెలు, టవళ్లను ఆయన స్థానిక మాస్టర్ వీవర్ల ద్వారా అందజేశారు. అలాగే స్థానిక గంగుండ్రమండపం సమీపంలో నివాసముంటున్న రైతు సుధాకర్‌రెడ్డి 56 మందికి చొక్కాలను అందజేశారు.

స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భద్రతపై స్వయంగా సమీక్షించారు. సీసీ కెమెరా కంట్రోల్ రూమ్‌లను పరిశీలించారు. అనంతరం సందర్శకుల రిజిస్టర్‌లో సంతకం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతతో పాటు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎన్నికల అధికారులు ఉన్నారు.

వైభవం... కల్యాణ వెంకన్న గరుడ సేవ



గరుడ వాహనంపై ఊరేగుతున్న కల్యాణ వెంకటేశ్వరస్వామి



పల్లకిలో మోహినీ అవతారంలో కల్యాణ వెంకటేశ్వరుడు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పక్షి రాజైన గరుత్మంతుడిని వాహనంగా చేసుకొని ఉత్సవమూర్తి భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం గరుడసేవ కావడంతో భక్తులతో ఆలయం పోటెత్తింది. ఉదయం మోహినిగా పల్లకిని అధిరోహించి మహిళల నుండి హారతులను అందుకున్నారు. వేకువ జామున 5 గంటలకు సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలతోపాటు నిర్మిత హోమ శాలలో ప్రత్యేక పూజలను పూర్తి చేసి, తొలి గంటతో దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం 5.30 గంటలకు లక్ష్మీకాసుల హారంతో, సుగంధ పుష్ప మాలికలు, పట్టు పీతాంబరాలు, స్వర్ణాభరణాలు అలంకరించుకున్న కల్యాణ వెంకన్న ఊంజల్‌సేవలో పాల్గొన్నారు. రాత్రి 7.30 గంటలకు గరుడ వాహనాన్ని అధిరోహించిన ఉత్సవర్లు గ్రామ వీధుల్లో ఊరేగింపుగా బయల్దేరారు. మంగళ వాయిద్యాలు, కోలాటాలు, భజనలతో గోవిందనామ స్మరణ మధ్య గరుడ వాహన ఉత్సవం మాడవీధుల్లో కొనసాగింది. మహిళలు కర్పూర హరతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 11గంటలకు ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం, శుద్ధి తదితర కార్యక్రమాలను పూర్తి చేసిన అర్చకులు ఏకాంత సేవను నిర్వహించారు.

పల్లకిపై మోహినీ రూపుడై...

దేవ, దానవుల క్షీర సాగర మథన సందర్భంలో ఉద్భవించిన అమృతాన్ని దేవతలకు పంచడానికి మహావిష్ణువు అవతారమెత్తిన మోహినీ రూపుడై సర్వాంగ సుందరంగా అలంకరించుకుని పల్లకిని అధిరోహించారు. మేళతాళాలు, డప్పుల వాయిద్యాల మధ్య గోవింద నామ స్మరణతో స్వామి వారి ఊరేగింపు గ్రామ వీధుల్లో కొనసాగించి. పల్లకిలో సుందర, కోమల రూపమైన మోహినిని ముందున్న అద్దంలో భక్తులు తిలకించి కర్పూర హారతులు ఇచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవమూర్తి ఉభయ దేవరులతో కలిసి స్నపన తిరుమంజనంలో సేదదీరి, దూప, దీప నైవేద్యాలను అందుకున్నారు. పై కార్యక్రమాలలో డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్, భద్రతా జమేదార్ కోదండరామశెట్టి తదితరులు పర్యవేక్షించారు. ఉత్సవాలలో ఆదివారం ఉదయం హనుమంత వాహనంపై, సాయంత్రం ఉభయ నాంచారులతో వసంతోత్సవంలోనూ, రాత్రి గజరాజుపై మోక్ష ప్రదాతగా భక్తులకు స్వామి వారు దర్శనమివ్వనున్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడండి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

పిచ్చాటూరు: మండలంలోని గ్రామాల్లో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యం, తాగునీరు తదితర అత్యవసర పనులకు పనులకు కోడ్‌ఆఫ్ కాండక్ట్ మినహాయింపు ఉంటుందన్నారు. అందులో భాగంగానే మండల మీట్‌లో ఈ రెండు అంశాలపైనే చర్చను కొనసాగించాలని సభ్యులకు సూచించారు. ఈ నేపథ్యంలో ఎక్కడైనా తాగునీటి ఎద్దడి తలెత్తితే పంచాయతీ తీర్మానంతో సమస్య పరిష్కరించే విధంగా పనులు చేపట్టి బిల్లులు పెడితే ప్రభుత్వం మంజూరు చేయడానికి సిద్ధగా ఉందన్నారు. అదేవిధంగా కొత్తగా నియామకమై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ వెంకటరమణ మాట్లాడుతూ తాగునీటి సమస్యపై తక్షణం స్పందిస్తానని, ఎల్లవేళలా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు అందుబాటులో ఉంటానన్నారు. వైద్యాధికారి డాక్టర్ హమీద్ మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చూడాలని ఏఎస్ఎం, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ విజయమ్మ, సింగిల్ విండో చైర్మన్ కేటీ హరిశ్చంద్రారెడ్డి, సర్పంచ్‌లు భూపతి, నారాయణమ్మ, అన్నాదురై, ఎంపీటీసీ సభ్యులు వేలు, తామరై సెల్వి, ఎంఈఓ హేమమాలిని, ఏపీఎం వనిత, ఏపీఓ నాగభూషణమ్మ, ఏఓ సంజీవ రెడ్డి, ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న సీఐ దివాకర్‌రెడ్డి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ దివాకర్‌రెడ్డి

నాగలాపురం: శాంతిభద్రతల రక్షణకు ప్రజలు, నాయకులు, యువత సహకరించాలని సత్యవేడు సీఐ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అసాంఘిక కార్యక్రమాల కట్టడే లక్ష్యంగా మండలంలో పలు చోట్ల కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. మండలంలోని వెళ్లూరు హరిజనవాడలో శనివారం ఉదయం వెళ్లూరు గ్రామంలోని ఈసంగాడు ప్రాంతంలో ఎస్ఐ ఓబయ్య, సత్యవేడు ఎస్ఐ వీరాంజనేయులు, వరదయ్యపాళెం ఎస్ఐ ప్రతాప్, పోలీసు సిబ్బందితో ఇంటింటా తనిఖీలు చేపట్టారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఎవరినైనా ఉపేక్షించేది ఉండదని సీఐ దివాకర్‌రెడ్డి హెచ్చరించారు. అనంతరం వాహనాలకు సంబంధించిన అన్ని రికార్డులు ఉండాలని స్పష్టం చేశారు. పట్టణంలో మోటారు సైకిల్ దొంగతనాలు ఎక్కువగా ఉండడంతో వాహనాలకు సంబంధించి సరైన రికార్డులు చూపించి తీసుకెళ్లచ్చని లేకుంటే దొంగబండ్లుగా భావించి సీజ్ చేస్తామని అన్నారు. చట్ట వ్యతిరేక పనులకు ఎవరైనా పాల్పడితే వెంటనే డయల్ 100కు, లేక స్థానిక పోలీస్‌స్టేషనుకు సమాచారం అందించాలని కోరారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

ఏర్పేడు: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో గిడ్డయ్య తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఎండాకాలం గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఎక్కడైనా సమస్య ఏర్పడితే యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీటి మోటార్లు, చేతిపంపుల మరమ్మతులను వెంటనే చేయాలన్నారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వలేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జమ్మల శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేంద్రప్రసాద్, డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగు కోసం చర్యలు



మురుగునీటి కాలువలను శుభ్రం చేస్తున్న కార్మికులు

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామంలోని ఈబీసీ కాలనీ, బీసీ కాలనీలలో శనివారం గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. కాలనీలలోని డ్రైనేజీ కాలువల్లోని మురుగును కూలీలతో తొలగించారు. అదే విధంగా వీధుల్లో నిల్వ ఉన్న చెత్తాచెదారాన్ని తొగించి, బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి ఓవరు హెడ్ ట్యాంకులో క్లోరినేషన్ చేయించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమలు వృద్ధి కాకుండా మలాథియాన్ పిచికారీ చేయించారు. మురుగునీటి నిల్వ లేకుండా చేయడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.



బ్లీచింగ్ చల్లుతున్న కార్మికులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: ఇంటి పరిసరాలతోపాటు, వీధులను శుభ్రంగా ఉంచుకుంటే దోమల బెడద ఉండదని, తద్వారా జ్వరాలు రావని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. శనివారం లక్ష్మీపురం ఎస్టీ కాలనీలో ఆయన వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాకాలంలో ముఖ్యంగా రెండు రకాలుగా ఉంటాయని అవి ఒకటి కలుషితమైన నీటి ద్వారా వచ్చే వ్యాధులు, రెండోవి దోమల ద్వారా వచ్చే వ్యాధులని తెలిపారు. కలుషితమైన నీరు, ఆహార పదార్థాలను తీసుకోవడంతో టైఫాయిడ్, నీళ్ల విరోచనాలు వ్యాధులు వస్తాయని, దోమల ద్వారా మలేరియా, వైరల్ ఫీవర్, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే కొంత వరకు వ్యాధులను అరికట్టవచ్చునన్నారు. వైద్య సిబ్బంది సూచనలు పాటిస్తే వ్యాధుల బారి నుంచి కాపాడుకోవచ్చునని తెలిపారు. కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, సీహెచ్ఓ వేంకటేశ్వర్లు, సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణముఖిలో గుర్తుతెలియని మృతదేహం



శ్రీకాళహస్తి: పట్టణంలోని స్వర్ణముఖి నదిలో శనివారం గుర్తుతెలియని మృతదేహం(35) వెలుగు చూసింది. 1వ పట్టణ పోలీసుల కథనం.. స్వర్ణముఖి నదిలో వ్యర్థాల మధ్య మృతదేహం పడి ఉండడం గుర్తించిన స్థానికులు 1వ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని మృతుని చిరునామా కోసం ఆరా తీశారు. లభ్యం కాకపోవడంతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

బంగారు తిరుచ్చిపై శ్రీనివాసుడు



బంగారు తిరుచ్చిపై భక్తులను అనుగ్రహిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేపట్టారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆసీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఆలయ ఏఈఓ గోపీనాథ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

సిద్ధార్థ కళాశాలలో సంబరాలు



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న అశోకరాజు

నారాయణవనం: సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజెస్‌లో శనివారం వేడుకగా జూబిలేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సినీ నటి డింపుల్ హయాతీ విచ్చేసి సందడి చేశారు. ఇంజినీరింగ్ విద్యార్థుల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాలల ఓపెన్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి చైర్మన్ డాక్టర్ అశోక్‌రాజు ముఖ్యఅతిథి విచ్చేశారు. ఏఐసీటీఈ కో–ఆర్డినేటర్ డాక్టర్ బుద్ధా చంద్రశేఖర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చదువు, క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే మెరిట్ సర్టిఫికెట్లు, రూ.50 వేల విలువ చేసే ట్యాబ్‌లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో పోటీ ప్రపంచంలో స్కిల్డ్ ఇంజినీర్‌గా గుర్తింపు పొందడానికి ప్రతి విద్యార్థిపై శ్రద్ధ చూపుతున్నామన్నారు. ప్రముఖ టీవీ యాంకర్ ఐశ్వర్య, డైరెక్టర్ పీఎస్ రాజు, ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దనరాజు, రమేష్, వివిద విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కరువు



వీఎస్‌పురం పంచాయతీ వేణుగోపాలపురంలో రోడ్డు మరమ్మతు పనులు చేస్తున్న కూలీలు



కాటూరులో వరవ కాలువ పనులు చేస్తున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ : వేసవి ఎండలు మండుతున్నాయి. కూలీలకు వడదెబ్బ తగలకుండా పని వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉపాధి హామీ పథకం అధికారులు పదేపదే సమావేశాల్లో చెబుతున్నారు. మండలంలోని సిబ్బంది ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని కూలీలు వాపోతున్నారు. మండలంలోని పల్లమాల, పార్లపల్లి, నీర్పాకోట, కాటూరు, వీఎస్‌పురం, తలారివెట్టు గ్రామ పంచాయతీలతోపాటు పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు తాగునీరు, టెంట్లు తదితర సౌకర్యాలు కల్పించలేదు. దీంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో గ్రామ పంచాయతీలో ప్రతి రోజూ 150 మంది కూలీలు చెరువులో పూడికతీత పనులు, రోడ్ల మరమ్మతులు, పంట కాలువల మరమ్మతులు చేస్తున్నారు. కూలీలకు పనుల వద్ద తాగునీరు, టెంట్లు, ఫస్టు ఎయిడ్ కిట్లు వంటి సౌకర్యాలను కల్పించాల్సి ఉంది. ఆ దిశగా సిబ్బంది చర్యలు తీసుకోకపోవడంతో కూలీలు అవస్థలు పడుతున్నారు. పెద్దపాలేడు, వేణుగోపాలపురం, కుక్కంబాకం గ్రామాలకు చెందిన పలువురు ఉపాధిలో పంటకాలువకు మరమ్మతు పనులు చేస్తూ వడదెబ్బకు గురై బుచ్చినాయుడుకండ్రిగలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కూలీలకు పనుల వద్ద సౌకర్యాలను కల్పించడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కూలీలకు సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎండవేడిమి తట్టుకోలేకపోతున్నాం

ఎండవేడిమిని తట్టులేకపోతున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలని అధికారులు చెబుతున్నా సిబ్బంది ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. తాగడానికి నీరు కూడా అందుబాటులో ఉంచడం లేదు. దీంతో పనిని చేయడానికి ఇబ్బందిగా ఉంది. పనివద్ద కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉంది.

– భవాని, కాటూరు గ్రామం

దాహంతో గొంతు ఎండిపోతోంది

పని వద్ద తాగునీరు లేకపోవడంతో గొంతు ఎండిపోతోంది. టెంట్లు వేస్తామని గతంలో చెప్పారు. సిబ్బంది పట్టించుకోలేదు. ఎండ వేడిమిని తట్టుకోలేక అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి పనులను కూడా ఉదయం, సాయంత్రం వేళ చేపట్టడంతోపాటు, పనివద్ద సౌకర్యాలు కల్పించాలి.

– వెంకటయ్య, కాటూరు గ్రామం

కౌంటింగ్‌పై మార్గదర్శకాలు



పోలీసుల నిఘా నీడలో శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌పై ఆర్వోలు, ఏఆర్ఓలు, ఎన్నికల డీటీలు, కౌంటింగ్ సిబ్బందికి ఎన్నికల సంఘం మార్గదర్శకాలు విడుదల చేసింది. ముఖ్యంగా స్ట్రాంగ్ రూమ్ లేఅవుట్‌పై ఇన్‌చార్జ్ అధికారి అవగాహన కలిగి ఉండాలని, నోడల్ అధికారులు వారికి అప్పగించిన పనులు సక్రమంగా నిర్వర్తించాలని, సందేహాలు వచ్చినప్పుడు ఆర్వోలతో ఎప్పటికప్పుడు మాట్లాడాలని, అంతేతప్ప సొంత నిర్ణయాలు తీసుకుంటే చర్యలకు గురవుతారని హెచ్చరించింది. పోస్టల్ బ్యాలెట్, స్ట్రాంగ్ రూమ్ నోడల్ అధికారులు, సీలింగ్ అధికారులు, రో–ఇన్‌చార్జ్‌లు అనుసరించాల్సిన విధి విధానాలను ప్రత్యేకంగా సూచించింది. పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ ఓట్లు ఎలా లెక్కించాలి, వ్యాలిడ్, ఇనావ్యాలిడ్ ఓట్లను ఎలా గుర్తించాలి అనేదానిపై కౌంటింగ్ సిబ్బందికి త్వరలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించింది. అలాగే ఓట్ల లెక్కింపు రోజున అధికారులు వారికి కేటాయించిన విధులకు సంబంధించి చెక్‌లిస్ట్ ప్రకారం ఏర్పాట్లు చేసుకోవాలని ఎన్నికల సంఘం పేర్కొంది. రౌండ్ల వారీగా ఫలితాల నమోదు, వాటిని ప్రకటించే క్రమంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కౌంటింగ్ పూర్తయి తుది ఫలితాలు ప్రకటన విడుదల చేయగానే గెలుపొందిన అభ్యర్థికి ఫారం 21–ఈని అందజేయాలని పేర్కొంది.